క్లుప్తంగా

విద్యారంగానికి ప్రాధాన్యం

● ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు



విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

డెంకాడ: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విద్యారంగానికి ఎనలేని ప్రాధాన్యం ఇస్తున్నారని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అన్నారు. మండలంలోని అక్కివరం పంచాయతీ పరిధి గొల్లపేట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో జగనన్న విద్యాకానుక కిట్లను వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, తదితరులతో కలిసి బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రోత్సాహాలను విద్యార్థులను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య, సర్పంచ్ కంది కిరణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు విజినిగిరి అచ్చింనాయుడు, తదతరులు పాల్గొన్నారు.

చేగువేరా స్ఫూర్తితో పోరాడుతాం..

విజయనగరం పూల్‌బాగ్: క్యూబా విప్లవ వీరుడు చేగువేరా స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై పోరాడుతామని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ రామకృష్ణ అన్నారు. ఎస్ఎఫ్ఐ విజయనగరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేగువేరా 95వ జయంతిని బుధవారం స్థానిక మూడులాంతర్ల వద్ద గల జిల్లా కార్యాలయంలో ఘనంగి నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు రవికుమార్, సౌమ్య, పట్టణ కార్యదర్శి రమేష్, లావణ్య , సమీరా, వెంకటరమణ, కల్యాణి, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి ఆలయ విస్తరణకు అంకురార్పణ



ఆలయం ఇరువైపులా చదును చేసేందుకు పూజా కార్యక్రమం నిర్వహిస్తున్న ఆలయ ఈఓ సుధారాణి

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ విస్తరణకు బుధవారం అంకురార్పణ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కేఎల్.సుధారాణి నేతృత్వంలో ఆలయం ఇరువైపులా ఉన్న షాపులను తొలగించి, వాటిని చదును చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అమ్మవారి ఆలయ అభివృద్ధికి ఇరువైపులా ఉన్న వర్తకులు ముందుకు రావడం ఆనందించదగ్గ విషయమన్నారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు, ట్రస్ట్ బోర్డు ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

● డీఎంహెచ్ఓ భాస్కరరావు



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం రూరల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి ఎస్. భాస్కరరావు అన్నారు. మండల పరిధిలోని రాకోడులో ఉన్న పీహెచ్‌సీని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని ఫార్మసీ, ల్యాబ్, ఓపీ రికార్డులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మండలంలోని జొన్నవలస ఆరోగ్య ఉపకేంద్రాన్ని పరిశీలించారు. అలాగే కొండకరకాం గ్రామాన్ని సందర్శించి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంపై ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యాధికారి జగదీష్, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం



అన్నసంతర్పణలో పాల్గొన్న కౌన్సిలర్ ప్రసాద్, ఆలయ కమిటీ ప్రతినిధులు

నెల్లిమర్ల: పట్టణంలోని ప్రధాన రహదారిలో నున్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఆరో వార్షికోత్సవం బుధవార ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ పెరుమాళ్ల మణికంఠ శాస్త్రి ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు. కార్యక్రమంలో ఏడో వార్డు కౌన్సిలర్ మైపాడ్ ప్రసాద్, ఇడదీసి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు కర్రి రామాచారి మాస్టారు, కొండపల్లి రమణ, అప్పలాచారి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో.. వెలుగులు నింపడమే జగనన్న ధ్యేయం

● ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించండి..

● డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

విజయనగరం: పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. నగరంలోని 48వ డివిజన్ గాజులరేగలో బుధవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. అలాగే ఒక్కో ఇంటికి నాలుగేళ్ల కాలంలో ఎంత లబ్ధి చేకూరినదీ తెలియజేస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం స్థానిక సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతోందన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నేతృత్వంలో కార్పొరేషన్‌లో అభివృద్ధి శరవేగంగా సాగుతోందని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపడుతున్న ప్రతి ప్రాంతంలో ప్రజలందరూ పాలనపై సంతోషం వ్యక్తం చేయడం గొప్ప విషయమన్నారు. ముఖ్యంగా మహిళలు సంబరాలు జరుపుకుంటున్నారని తెలిపారు. అమ్మఒడి, ఆసరా, పింఛన్లు, వసతి దీవెన, సున్నావడ్డీ, రైతుభరోసా, తదితర సంక్షేమ పథకాలు అందుతుండడంతో ప్రతి ఇంటా పండగ వాతావరణం కనిపిస్తోందని చెప్పారు. స్థానిక కార్పొరేటర్ నడిపిల్లి ఆదినారాయణ మాట్లాడుతూ, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా కోలగట్లను రానున్న ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, జోనల్ ఇన్‌చార్జ్ బోడసింగి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

26వ డివిజన్‌లో..

విజయనగరం: నగరంలోని 26వ డివిజన్ పన్నీర్‌వారి వీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నగర డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, లయాయాదవ్ పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ, పాలనపై ప్రజాభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్ల కాలంలో సంక్షేమ పథకాల వల్ల ఒక్కో ఇంటికి ఎంత లబ్ధి చేకూరినదీ వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ లయాయాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎవర్న కుమారస్వామి మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను అవినీతి రహితంగా ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో డివిజన్ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్పొరేషన్ సిబ్బంది, కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కల్యాణి, లయాయాదవ్, తదితరులు

జోరువానలోనూ..

విజయనగరం రూరల్: మండలంలోని జొన్నవలసలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జోరువానలోనూ ఎమ్మెల్యే కోలగట్ల, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథ్ మాట్లాడుతూ.. తాము గడపకుగడపకు వెళ్తున్న సమయంలో ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా చేరుతున్నాయో, లేదో నేరుగా అడిగి తెలుసుకునే విధానం గతంలో ఎప్పుడూ లేదన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే ఇది సాధ్యమైందని తెలిపారు. గతంలో ప్రజాప్రతినిధులు ఇళ్లకే పరిమితమయ్యే వారిని, స్థానిక శాసనసభ్యుడు కోలగట్ల గెలిచిన మరుక్షణం నుంచి నియోజకవర్గంలో పర్యటిస్తూ సమస్యలు పరిష్కరిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, సర్పంచ్ కంది రమాదేవి, స్థానిక నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



విజయనగరం రూరల్: లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విద్యారంగంలో మనమే టాప్..

● వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు



ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న విద్యార్థులు

విజయనగరం: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చి మన రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దారని వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా విద్యార్థి విభాగం నాయకులు కొనియాడారు. విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, బ్యాగ్‌లు, దుస్తులు, బూట్లు, తదితర వస్తువులను పాఠశాలల ప్రారంభ సమయానికి జగనన్న విద్యాకానుక పేరిట అందించడం విద్యారంగ అభివృద్ధి పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందన్నారు. విద్యా కానుకలు అందజేయడంపై బుధవారం స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల నివాసంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు కరుమజ్జి సాయి మాట్లాడుతూ, విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. గత ప్రభుత్వం విద్యార్థులకు కనీసం పాఠ్యపుస్తకాలు కూడా అందించలేదన్నారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు – నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లారని కొనియాడారు. విద్యార్థి విభాగం పట్టణ అధ్యక్షుడు కేదారిశెట్టి లక్ష్మణరావు మాట్లాడుతూ, గతంలో ప్రభుత్వ పాఠశాలలు నిర్లక్ష్యానికి గురైతే నేటి ప్రభుత్వంలో ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు నిలదొక్కుకున్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ ఎస్. బంగారునాయుడు, విద్యార్థి విభాగం నాయకులు బోనాల తరుణ్, పవన్‌కుమార్, సాయి, స్వరూప్, పృథ్వీ పాల్గొన్నారు.

పౌరసరఫరాల గొడౌన్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్ఓ మధుసూదనరావు

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని పౌరసరఫరాల గొడౌన్‌ను జిల్లా పౌరసరఫరాల అధికారి కె. మధుసూదనరావు, విజిలెన్స్ సీఐ బి. సింహాచలం బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, స్టాకు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గొడౌన్ నుంచి సరుకులు తీసుకెళ్లే సమయంలో తూకం చేసి ఇస్తున్నదీ, లేనిదీ పూసపాటిరేగ, భోగాపురం మండలాలకు చెందిన పలువురు రేషను షాపు డీలర్లను అడిగి తెలుసుకున్నారు. వారితో పాటు సివిల్ సప్లై జిల్లా మేనేజర్ మీనాకుమారి, అసిస్టెంట్ కంట్రోలర్ రంగారెడ్డి, ఫుడ్ అధికారి ఈశ్వరి, తహసీల్దార్ బంగార్రాజు, సీఎస్‌డీటీ మురళి, తదితరులు ఉన్నారు.

ఆన్‌లైన్‌లో వ్యాధుల వివరాలు

● డీఎంహెచ్ఓ భాస్కరరావు



వెంకటరామ ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రతిరోజూ నమోదయ్యే వ్యాధుల వివరాలు ఆన్‌లైన్ పోర్టల్‌లో పొందుపరచాలని డీఎంహెచ్ఓ ఎస్. భాస్కరరావు అన్నారు. పట్టణంలోని సాయి సూపర్‌స్పెషాలిటీ, వెంకటరామా, తిరుమల మెడికవర్, మువ్వగోపాల, గాయత్రి ప్రైవేట్ ఆస్పత్రులను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, తదితర వ్యాధుల వివరాలను ఐహెచ్ఐపీ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అలాగే వ్యాధుల చికిత్సకు వసూలు చేసే ఫీజుల వివరాలను తెలిపే బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎంఓ ఎం. తులసి , ఎపిడిమాలజిస్ట్ జి. వెంకటేష్, డెమో చిన్నతల్లి, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యరాజ్ పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చేస్తే కఠిన చర్యలు

● రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు

విజయనగరం ఫోర్ట్: నిబంధనలకు విరుద్ధంగా బాల్య వివాహాలు చేసేవారిపై పోలీసులు కేసులు నమోదు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో మాస్టర్ ట్రైనీలు, కౌమార సాధికారత, బాల్య వివాహాల నివారణపై రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బాల్య వివాహాల నిర్మూలనకు రూపొందించిన చట్టాన్ని అధికారులు కఠినంగా అమలు చేయాలని తెలిపారు. యునిసెఫ్ కన్సల్టెంట్ ఎం.కె.జోన్స్ మాట్లాడుతూ, విజయనగరం జిల్లాలో బాల్య వివాహాల శాతం 29 నుంచి 33 శాతానికి పెరిగిందని తెలిపారు. బాల్య వివాహాలు జరగడంలో విజయనగరం జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉందన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారి బి. శాంతకుమారి, జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ, కృష్ణవేణి, విద్య, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సహకారంతో మెరుగైన సేవలు

● డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



ఉచిత అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ.. స్వచ్ఛంద సంస్థల సహకారంతో మరింత మెరుగైన సేవలు అందించవచ్చని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. విశాఖకు చెందిన రౌండ్ టేబుల్ ఆఫ్ ఇండియా సంస్థ, మహేంద్ర హాస్పిటల్ వైద్యుడు గిరి సహకారంతో ఏర్పాటు చేసిన అంబులెన్స్‌ను బుధవారం తన నివాసం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విజయనగరం ప్రజలకు ఉపయోగపడాలన్న ఉద్దేశంతో ఉచితంగా అంబులెన్స్ సమకూర్చడం అభినందనీయమన్నారు. ఇప్పటికే ఈ సంస్థ వారు నగరంలో రాధాకృష్ణ పార్క్, అయ్యన్నపేట పాఠశాల, 11వ డివిజన్‌లో మరో పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. వైద్యుడు గిరి మాట్లాడుతూ, అంబులెన్స్ సేవలు అవసరమైన వారు 96426 22311 నంబర్‌కు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ విశాఖ చైర్మన్ ప్రతీక్ సింఘి, ఏపీ – తెలంగాణల కార్యదర్శి సందీప్‌రెడ్డి, అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ లెజిస్లేచర్ కాన్ఫరెన్స్‌కు ఎమ్మెల్సీ



డాక్టర్ సురేష్‌బాబు

నెల్లిమర్ల: ఈ నెల 15వ తేదీ నుంచి 18 వరకు ముంబైలో జరగనున్న నేషనల్ లెజిస్లేచర్ కాన్ఫరెన్స్‌కు ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్య నారాయణరాజు (సురేష్‌బాబు) హాజరుకానున్నారు. ఈ మేరకు కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని ఆయనకు ప్రత్యేక ఆహ్వానం అందింది. తనతో పాటు మరో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు కూడా కాన్ఫరెన్స్‌లో పాల్గొంటారని సురేష్‌బాబు తెలిపారు. 19వ తేదీ నుంచి జిల్లాలో అందుబాటులో ఉంటానని ఆయన చెప్పారు.

22లోగా దరఖాస్తు చేసుకోవాలి

డెంకాడ: మండలంలోని పినతాడవాడ పంచాయతీ పరిధి ఒమ్మిదొడ్డి అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుకు ఈ నెల 22వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని భోగాపురం సీడీపీఓ టి.ఎస్తేరురాణి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టు బీసీ – బీ కేటగిరీకి కేటాయించినట్లు పేర్కొన్నారు. అలాగే మండలంలోని చొల్లంగిపేట పంచాయతీ పరిధిలోని గువ్విపేట మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పోస్టు ఓసీ కేటగిరీకి కేటాయించారని పేర్కొన్నారు.

రక్తదాతలను సత్కరించడం అభినందనీయం..

● జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



ఎక్కువ సార్లు రక్తదానం చేసిన అంధుడిని అభినందిస్తున్న శ్రావణి, బాబ్జీ, అప్పారావు



రక్తదానం చేస్తున్న దాతలు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: ఎంతోమంది ప్రాణాలు నిలబెడుతున్న రక్తదాతలను సత్కరించడం అభినందనీయమని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఉదయం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా విజయదుర్గా యూత్ సొసైటీ, విజయనగరం యూత్ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో విజయ బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అన్ని దానాల కంటే రక్తదానం గొప్పదన్నారు. ఒకరు రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న నలుగురు ప్రాణాలు కాపాడవచ్చని చెప్పారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చన్నారు. అనంతరం రక్తదాతలు, నిర్వాహకులను సత్కరించారు. జిల్లా స్వచ్ఛంద సంస్థల సమైక్య అధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, నిర్వాహకులు కేశవపట్నం విజయలక్ష్మి, గెద్ద చిరంజీవి, డాక్టర్ ఎస్. అచ్చిరెడ్డి, కరుణాకర్, వాళ్ళే గౌరినాయుడు, పుణ్యవంతుల శివ, కేశవపట్నం చంద్రిక, షేక్ ఇల్తమాష్, రోయల్ క్యాబ్స్ శరత్, యమున, సాయి షణ్ముఖ, తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి

● డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: నేటి యువతరం ఎంచుకున్న రంగంలో రాణించడంతో పాటు.. సేవాభావం కూడా అలవర్చుకోవాలని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా న్యూ విజయనగరం యూత్ ఫౌండేషన్, ఎన్‌వీఎన్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రెవెన్యూ హోమ్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోలగట్ల శ్రావణి లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, పీటీసీ వైస్ ప్రిన్సిపాల్ పీవీ అప్పారావులతో కలసి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎవరికి ఆపద వచ్చినా తామున్నామంటూ ముందుకు వస్తున్న న్యూ విజయనగరం యూత్ ఫౌండేషన్ సభ్యులు అభినందనీయులన్నారు. సభ్యుల్లో మహిళలు కూడా ఉండి రక్తదాన చేయడం గొప్ప విషయమని చెప్పారు. సేవా కార్యక్రమాలకు ఒక సోదరిగా తన వంతు సంపూర్ణ సహకారం ఉంటుందని చెప్పారు. సేవ చేయాలనే ఉద్దేశంతోనే తాను రాజకీయ రంగంలోకి వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వాటిని యువతరం వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, పీటీసీ వైస్ ప్రిన్సిపాల్ అప్పారావు మాట్లాడుతూ, రక్తదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు రక్తదాతలు, నిర్వాహకులు, వివిధ రంగాల్లో సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులను సత్కరించారు. రక్తదాతలను అభినందించారు.

స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకం

విజయనగరం: ఆపదలో ఉన్నవారికి రక్తం చేరవేయడంలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకమని రోటరీ ప్రధాన క్లబ్ అధ్యక్షురాలు డి.ఉమాబాలాజీ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఎన్‌సీఎస్ రోడ్డులో ఉన్న రోటరీ సామాజిక భవనంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 45 యూనిట్ల రక్తాన్ని సేకరించి పార్వతీదేవి అంచాలియా రోటరీ రక్తనిధి కేంద్రానికి అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి సూర్యలక్ష్మి, డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆడిటర్ డి.బాలాజీ, రోటరీ పూర్వపు అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ అంచాలియా, కంటుభుక్త తవిటిరాజు, కాపుగంటి రవి, నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం ఫోర్ట్: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



నెల్లిమర్ల: రక్తదానం చేస్తున్న విద్యార్థులు



నెల్లిమర్ల రూరల్: రక్తదానం చేస్తామంటూ ప్రతిజ్ఞ చేస్తున్న సెంచూరియన్‌వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు

సెంచూరియన్‌లో ప్రతిజ్ఞ

నెల్లిమర్ల రూరల్: రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో విద్యార్థులు, అధ్యాపకులు రక్తదాన ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ, రక్తదానం చేయడం వల్ల ఎటువంటి బలహీనత ఉండదన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను నిలబెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మిమ్స్‌లో రక్తదాన శిబిరం

నెల్లిమర్ల: పట్టణంలోని మిమ్స్ కళాశాలలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో పలువురు వైద్య విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. హెచ్‌ఆర్ మేనేజర్ ఆరిపాక శ్రీనివాసరావు, పీడీ కళా వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకురావాలి

విజయనగరం ఫోర్ట్: రక్తదానానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ గౌరీశంకర్ అన్నారు. స్థానిక ఎంఆర్ కళాశాల విద్యార్థులతో రక్తదానంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సతీష్, చిన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.